విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

గురువారం 22 మే 2025 8 పేజీలు

బిల్లులు పెట్టుకోవటానికే నామమాత్రపు పనులు

- అధికారుల తీరుపై జిల్లా ఇంఛార్జి మంత్రి కొలుసు పార్థసారధి ఆగ్రహం
- మంత్రులు గొట్టిపాటి, అనగాని, ఎంపీ తెన్నేటి అసహనం

విశాలాంధ్ర బ్యూరో - బాపట్ల : వర్షాలు మొదలవుతుంటే పనులు ఎప్పుడు చేస్తారు.. ఎలా పూర్తవుతాయి.... పంట కాల్వల మరమ్మతు పనులు నామమాత్రంగా నిర్వహించటం బిల్లులు పెట్టుకోవడానికా అంటూ జిల్లా ఇంఛార్జి మంత్రి, సమాచార పౌర సంబంధాల, గృహ నిర్మాణశాఖల మంత్రి కొలుసు పార్థసారథి అధికారులను నిలదీశారు. జిల్లా అభివృద్ధి మండలి సమీక్షా సమావేశం స్థానిక కలెక్టరేట్‌లోని విసి హాల్లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన బుధవారం జరిగింది. జల వనరులు, వ్యవసాయ, జాతీయ ఉపాధి పథకం, పర్యాటక రంగం తదితర అంశాలపై సమీక్ష సాగింది. ప్రజలకు మేలు చేయడమే లక్ష్యంతో పనిచేయాలని అధికారులకు జిల్లా ఇన్చార్జి మంత్రి మార్గ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పంట కాలువల మరమ్మతు పనులను నెల రోజుల్లో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సంవత్సరంలో వర్షాలు ముందుగా వచ్చే అవకాశం ఉందన్నారు. సాగునీరు విడుదలకు సిద్ధంగా ఉండాలి, ముందస్తుగా పంటల సాగుకు రైతులను సమాయత్తం చేయాలన్నారు. పంట కాల్వల పూడికతీత, మరమ్మతు పనులు వర్షాలు రాకముందే పూర్తి చేయాలని ఆదేశించారు. మార్చిలోగా టెండర్లు పూర్తి చేసి, వేసవిలోగా పనులు ముగించాలని గతంలో ఆదేశించినప్పటికి నేటికీ టెండర్లు ప్రక్రియలోనే ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడానికి సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. పొరుగు జిల్లాల కంటే మరింత అభివృద్ధి సాధించాలనే పోటీతత్వంతో అధికారులు పనిచేయాలన్నారు. గడిచిన ఏడాదిలో జరిగిన అభివృద్ధి, వివిధ రంగాలలో ఆర్థిక వృద్ధిపై అధికారులు నివేదిక సిద్ధం చేయాలన్నారు. వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగడం మాని, మీ ఇంటి నుంచి ప్రభుత్వ సేవలు పొందే విధానంపై ప్రజలలో చైతన్యం మిగతా 2 లో ...

యోగా అందరి జీవితాల్లో భాగం కావాలి

జిల్లా ఇంఛార్జి మంత్రి కొలుసు పార్థసారధి

విశాలాంధ్ర - బాపట్ల : యోగా అందరి జీవితాల్లో భాగం కావాలని గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి జిల్లా ఇన్చార్జి మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మంగళవారం, స్థానిక పోలీస్ కవాతు మైదానంలో ఏర్పాటు చేసిన యోగాంధ్ర క్యాంపెయిన్ కర్టెన్ రైజర్ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి మంత్రి కొలుసు పార్థసారథి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్,జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి, బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మరాజు, పర్చూరు శాసనసభ్యులు ఏలూరు సాంబశివరావు, చీరాల శాసనసభ్యులు ఎం ఎం కొండయ్య పాల్గొని యోగ గురువు పతంజలి చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతిని వెలిగించారు. జిల్లా ఇన్చార్జి మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి 69వ సమావేశంలో మిగతా 2 లో ...

ఘోర రోడ్డు ప్రమాదం.. ఇద్దరు మృతి

2 లో..

భేదాలు, అలకలు వీడి కలిసికట్టుగా పనిచేద్దాం..

బాపట్ల పార్లమెంట్ మినీ మహానాడులో మంత్రి కొలుసు పార్థసారధి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : భేదాలు, అలకలు వీడి టీడీపీ జనసేన బీజేపీ పార్టీల నేతలు కార్యకర్తలు కలిసికట్టుగా సమాజం అభ్యున్నతికి పాటుపడాలని జిల్లా ఇంఛార్జి మంత్రి కొలుసు పార్థసారధి పిలుపునిచ్చారు. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం రాత్రి బాపట్ల పార్లమెంట్ మినీ మహానాడు జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి వర్యులు గొట్టిపాటి రవి కుమార్ బాపట్ల పార్లమెంట్ తెన్నేటి కృష్ణ ప్రసాద్, బాపట్ల జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సలగల రాజశేఖర్ బాబు,వేమూరు నియోజకవర్గ శాసన సభ్యులు నక్కా ఆనంద్ బాబు, చీరాల నియోజకవర్గ శాసన సభ్యులు మాల కొండయ్య, పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు, సంతనూతలపాడు మిగతా 2 లో ...

గుంతలు కనపడకుండా కళ్లకు గంతలు కట్టుకున్నారా...

7 లో..

కార్యకర్తలే టీడీపీ బలం

- ఎల్లవేళలా అండగా ఉంటాం
- టీడీపీ ఆధ్వర్యంలోనే జిల్లా అభివృద్ధి
- ఒంగోలుకు ప్రతిరోజు తాగునీరు అందిస్తాం
- 2 సెంట్లు చొప్పున పేదలకు ఇళ్ల స్థలాలు అందిస్తాం..
- ఒంగోలు నియోజకవర్గ మినీ మహానాడులో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల, టీడీపీ జిల్లా అధ్యక్షులు నూకసాని

విశాలాంధ్ర -ఒంగోలు : తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలమని, వారి రుణం ఏం చేసినా తీర్చుకోలేనిదని ఒంగోలు ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్దన్ రావు, టీడీపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ నూకసాని బాలాజీ అన్నారు. ఒంగోలులోని ఎంఎస్ ఫంక్షన్ హాలులో బుధవారం తెలుగుదేశం పార్టీ ఒంగోలు నియోజక వర్గం మినీ మహానాడు నిర్వహించారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కార్యకర్తల పార్టీ అన్నారు. ఒంగోలులో తెలుగుదేశానికి ఘన విజయాన్ని అందించిన ఘనత కార్యకర్తలది అన్నారు. పార్టీని స్థాపించిన ఎన్టీఆర్ దేశంలో ఏ నాయకుడికి లేనివిధంగా పేదలకు కిలో రెండు రూపాయలు బియ్యం, పక్క గృహాలు, పింఛన్ వంటి శాశ్వత సంక్షేమ పథకాలు అందించాలన్నారు. ఆయన బాటలోని నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ ప్రజల కోసం పని చేస్తున్నారన్నారు. ఒంగోలు నియోజక వర్గ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు త్వరలో ఒంగోలుకు ప్రతిరోజు తాగునీరు అందిస్తామని, పేదలకు రెండు సెంట్లు వంతెన నివేసిత స్థలం తో పాటుగా ఇంటిని కూడా నిర్మించి ఇస్తామని, పోతురాజు కాలువ అభివృద్ధి చేస్తామని, డీకే భూములు కొనుగోలు చేసి ఇల్లు నిర్మించుకున్న వారికి వారి పేరుతోనే తిరిగి వీళ్ళ పట్టాలు ఇస్తామని, ఒంగోలు నగరాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. అంతకు ముందుగా మాట్లాడిన డాక్టర్లుకు ఇస్తాను బాలాజీ తెలుగుదేశం పార్టీ బిసి, ఎస్సీ, ఎస్టీల పార్టీ అన్నారు. అనగా నేనా వర్గాలను అభివృద్ధిలోకి తెచ్చిన పార్టీ అన్నారు. ఎన్టీఆర్ మహిళలకు తగిన గౌరవం ఇస్తూ ఆస్తిలో వాటా ఇవ్వటంతో పాటుగా, రిజర్వేషన్ కూడా కల్పించారన్నారు. జగన్ తిరిగి అధికారంలోకి వస్తానని కలలు కంటున్నారని, అవి కలలుగానే మిగిలిపోతాయని ఎద్దేవా చేశారు. కార్యక్రమానికి ముందుగా నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మినీ మహానాడు కార్యక్రమాన్ని అతిథులు చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఒంగోలు నగరం మేయర్ గంగాడ సుజాత, పిడిసిసి బ్యాంక్ చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, టిడిపి ఒంగోలు నియోజక వర్గం పరిశీలకులు వినుకొండ సుబ్రహ్మణ్యం, వైవి సుబ్బారావు, కొఠారి నాగేశ్వరరావు, మంత్రి శ్రీనివాసరావు, కామేపల్లి శ్రీనివాసరావు, యక్కల తులసిరావు,, రావుల పద్మజ, కుసుమ కుమారి, సింగరాజు రాంబాబు, టిడిపి కార్పోరేటర్లు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : వేసవి సెలవులలో యువతను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో, యువతలో క్రీడలను ప్రోత్సహించాలని, క్రీడా స్ఫూర్తి, శారీరక ఆనందము, ఉల్లాసం కోసం బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ జన్మదినం సందర్భంగా తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరి యానెట్ సొపాటి ఆధ్వర్యంలో మండలంలోని సంగుపాలెం గ్రామంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ను గ్రామ పార్టీ అధ్యక్షులు కడియాల ప్రసాద్ తో కలిసి బుధవారం ప్రారంభించారు. బుధవారం నుంచి 23వ వరకు ఈ క్రికెట్ టోర్నమెంట్ జరగనుంది. ఈ నెల 23 న బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ జన్మదినోత్సవ రోజున ఫైనల్ నిర్వహించి బహుమతులు ప్రధానం చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన కారు

ఇద్దరు రైతులు అక్కడికక్కడే మృతి

విశాలాంధ్ర-మార్కాపురం : మండలంలోని కోమటికుంట వద్ద (అమరావతి- అనంతపురం) జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనంపై వెళ్తున్న (టీవీఎస్ ఎక్సెల్) వాహనాన్ని వెనక నుండి కంభం వైపు వెళ్తున్న కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మార్కాపురం మండలంలోని కొండేపల్లి గ్రామానికి చెందిన చాగంటి గాలిరెడ్డి (64), మండలంలోని వేములకోట పంచాయతీలోని వేముల పేట గ్రామానికి చెందిన జంకె శ్రీనివాసరెడ్డి (55)లు మృతి చెందారు. ఈ సమాచారాన్ని తెలుసుకున్న గ్రామీణ ఎస్సై అంకమ్మరావు, ఏఎస్ఐ లక్ష్మీ రంగయ్య, పోలీస్ సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను మార్కాపురం జీజీహెచ్‌కీ తరలించారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : కారు ఢీకొన్న ఘటనలో మోటార్ సైకిల్ పై ఉంది వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన బుధవారం సాయంత్రం ఉప్పుగుండూరు గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన బెల్లం ఆంజనేయులు మోటార్ సైకిల్‌పై ఉప్పుగుండూరు గ్రామంలోని సర్వీస్ రోడ్డు నుండి 216 జాతీయ రహదారి పైకి ఎక్కే ఇష్టం బాపట్ల నుండి కావలి వైపు వెళ్తున్న కారు మోటార్ సైకిల్ పై వ్యక్తిని నేరుగా వచ్చి మోటార్ సైకిల్ ను ఢీకొనడంతో మోటార్ సైకిల్ నుజ్జునుజ్జయ్యి బండి మీద ఉన్న బెల్లం ఆంజనేయులుకు తీవ్రగాయాలు కావడంతో 108 వాహనంలో ఒంగోలు ఆసుపత్రికి తరలించారు.

యర్రగొండపాలెంలో మినీ మహానాడు

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : యర్రగొండపాలెం పట్టణంలో బుధవారం తెలుగుదేశం పార్టీ మినీ మహానాడు కారణంగా రాజకీయ ఉత్సాహానికి కేంద్ర బిందువుగా మారింది. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ఇంచార్జ్ ఎరిక్షన్ బాబు నేతృత్వం వహించారు. ఎన్టీఆర్ సెంటర్ వద్ద స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహానికి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం పెద్ద ఎత్తున ఊరేగింపుగా పార్టీ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. సభలో ప్రసంగించిన ఎరిక్షన్ బాబు పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సజీవ సాక్ష్యంగా నిలవాలని, ప్రతి కుటుంబానికి టీడీపీ సిద్ధాంతాలు చేరేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సభకు పరిశీలకుడిగా హాజరైన వేములకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ నిర్మాణంలో ఆధునికత, మౌలిక బలోపేతంపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐదు మండలాల మండల కన్వీనర్లు చేకూరి సుబ్బారావు, పయ్యావు ప్రసాద్, ఏరువ మల్లికార్జునరెడ్డి, వలరాజు, శ్రీనివాసరెడ్డి, నాయకులు మంత్రు నాయక్ పాల్గొన్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం.. ఇద్దరు మృతి

విశాలాంధ్ర - జె.పంగులూరు : మండలంలోని ముప్పవరం గ్రామం వద్ద జాతీయ రహదారిపై జరిగిన కారు ప్రమాదంలో అక్కడికక్కడే ఇద్దరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం మధ్యాహ్నం 1 గంట సమయంలో విశాఖపట్నం నుంచి నెల్లూరు వెళ్తున్న ఏపీ07 ఎకె1199 నెంబర్ గల కారులోని వ్యక్తులు కారు అపి రోడ్డు పక్కన గల తాటి ముంజలు కొనుగోలు చేస్తుండగా వెనుక నుంచి వచ్చిన మరొక ఏపి39ఏయు

0127 నెంబరు గల కారు వేగంగా ఆగి ఉన్న కారును ఢీకొన్నది. ఈ ప్రమాదంలో తాటి ముంజలు అమ్మే వ్యక్తి దిలీప్ కొనుగోలు చేస్తున్న విశాఖపట్నంకు చెందిన వ్యక్తి సంపంగుల వెంకటరావు ఇద్దరు అక్కడికక్కడే చనిపోగా కారులో ఉన్న మరొక వ్యక్తి ఎమ్ వెంకటేశ్వర్లు తీవ్ర గాయాలయ్యాయి. అందరిని చికిత్స నిమిత్తం108 అంబులెన్స్‌లో అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా దిలీప్ వెంకటరావు అప్పటికే చనియయారని డాక్టర్లు చెప్పారు. తీవ్రంగా గాయపడిన విశాఖపట్నంకు చెందిన వెంకటేశ్వర్లును చికిత్స అనంతరం వారి బంధువులు మెరుగైన చికిత్స కోసం నెల్లూరు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నామమాత్రపు పనులు

(మొదటిపేజీ తరువాయి)

తీసుకురావాలన్నారు. వేసవికాలం ముగిసే వరకు తాగునీటి సమస్య రానివ్వరాదని, ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నీటి తీరువాకు వడ్డీని ప్రభుత్వం రద్దు చేసిందని, ఆ మేరకు డీఆర్సీలో కమిటీ ఆమోదించి తీర్మానం చేసినట్లు ప్రకటించారు. జిల్లా జీఎస్‌డిపి పెంచడమే లక్ష్యంతో అధికారులు పనిచేయాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద గత ఏడాది రూ.20 కోట్ల నిధులు మురిగిపోవడంపై అధికారులను నిలదీశారు. పేద ప్రజలకు పనులు కల్పించలేకపోవడం, జిల్లాకు నష్టం జరగకుండా అధికారులు ప్రణాళికతో పనిచేయాలన్నారు. పొగాకు పంట అధికంగా సాగు చేయాలని కంపెనీలు ఒత్తిడి చేసి, దిగుబడి వచ్చిన తర్వాత రైతులను వదిలేయడం మంచి పద్ధతి కాదన్నారు. కనీస ధరలు కల్పించకుండా రైతులను బ్లాక్ మెయిల్ చేస్తే కంపెనీలపై చర్యలు తీసుకోవాలన్నారు. బాపట్ల జిల్లా అభివృద్ధి బాటలో పయనించడానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసి పనిచేయాలని తెలిపారు.

– రైతుల నుంచి నీటి తీరువాకు వడ్డీని వసూలు చేయరాదని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. తక్షణమే వడ్డీ రాయితీని అమలు చేయాలన్నారు. జల వనరులు, మైన్స్ అధికారులు పర్యవేక్షణ ఉండాలన్నారు. గుండ్లకమ్మ నదిపై మల్లవరం ప్రాజెక్ట్ గేట్లు పూర్తిగా మరమ్మతులు చేయాలన్నారు. పనులు ఎట్టి పరిస్థితుల్లో ఆపరాదని, నిధులు తెప్పించే బాధ్యత తీసుకుంటామన్నారు. ఎత్తిపోతల పథకం కింద ఉన్న ప్రాజెక్టుల మరమ్మతులకు పునరుద్ధరణ ధరలతో అంచనాలపై నివేదిక పంపాలన్నారు. పమిడిమర్రు ఎత్తిపోతల పథకం అంచనాలను రూపొందించాలన్నారు. ఈ పనులు వేగంగా జరగడానికి తాత్కాలిక పద్ధతిలో సిబ్బందిని నియమించాలన్నారు. తక్షణమే ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాలన్నారు.

– ఎత్తిపోతల పథకాల పనులు వేగంగా చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. మీరు పనులు చేయండి, నిధులు మంజూరు చేయిస్తామన్నారు. వేలాది ఎకరాల సాగు పెరగడంతోపాటు రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. నీటి తీరువా వసూలులో భూమి అమ్మిన వారి పేర్లు కూడా ఆన్ లైన్‌లో చూపిస్తున్నాయన్నారు. తద్వారా భూ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, వాటిని నివారించాలన్నారు.

– జల జీవన్ మిషన్ కింద రూ.532.39 కోట్లు పనులు చేయకపోవడంతోనే నిధులు మురిగిపోయాయని బాపట్ల పార్లమెంట్ సభ్యులు, పానెల్ స్పీకర్, హోం వ్యవహారాల స్టాండింగ్ కమిటీ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్ అన్నారు. 1,080 పనులు నిలిచిపోవడం ఏమిటని ప్రశ్నించారు. జిల్లా అభివృద్ధికి, జిల్లా ప్రజలకు నష్టం జరుగుతుంటే అధికారులు చూస్తున్నారా అంటూ నిలదీశారు. ఉపాధి పనులు తక్కువగా చేయడం ద్వారా జిల్లాకు నష్టం వాటిల్లిందన్నారు. వేమూరు నియోజకవర్గంలో గతేడాది కేవలం 62.80 శాతం పనులు జరగడం ఏమిటని అసహనం వ్యక్తం చేశారు.

– ప్రభుత్వ లక్ష్యాల సాధన దిశగా యంత్రాంగం అడుగులు ముందుకు వేస్తోందని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. పొగాకు సాగు చేసే సమయంలో కంపెనీలు ఒత్తిడి చేసి సాగు విస్తీరణం పెంచాయన్నారు. ఇప్పుడు కొనుగోలు చేయకుండా ఉంటే అలాంటి కంపెనీలపై క్రిమినల్ కేసులు పెట్టే అంశాన్ని పరిశీలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్వదేశీ దర్శి– 2 కింద సూర్యలంక బీచ్ ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.97 కోట్లు పర్యాటకానికి నిధులు విడుదలయ్యాయన్నారు.

యోగా అందరి జీవితాల్లో భాగం కావాలి

(మొదటిపేజీ తరువాయి)

2014 సెప్టెంబర్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జూన్ 21వ తేదీన అంతర్జాతీయ దినోత్సవం జరపాల్సిందిగా ప్రతిపాదించారని ఆయన తెలిపారు. ఈ ప్రతిపాదనను 177 దేశాలు ఆమోదించడం జరిగిందన్నారు. 2015 సంవత్సరం నుండి ప్రతి ఏటా జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. యోగా వల్ల ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాలపై ఈ రోజు నుంచి నెలరోజులపాటు విస్తృతంగా అవగాహన కల్పిస్తామని ఆయన తెలిపారు. జూన్ 21వ తేదీన వైజాగ్‌లో 5 లక్షల మందితో జరిగే యోగా కార్యక్రమంలో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి పాల్గొంటున్నారని ఆయన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండు కోట్ల మంది యోగా ప్రయోజనాలు పొందాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. యోగాంధ్ర క్యాంపెయిన్‌ను ప్రారంభిస్తూ, యోగాంధ్ర-కర్టెన్ రైజర్ కార్యక్రమం నిర్వహించుకుంటున్నామన్నారు. పాఠశాలల్లో, కళాశాలలో, యూనివర్సిటీలలో యోగాకు సంబంధించిన పోటీలు, నిర్వహించ బడతాయన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యోగా వలన శారీరక, మానసిక ధైర్యం వస్తుందని అన్నారు. మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, జిల్లా కలెక్టర్, శాసనసభ్యులు, జిల్లా అధికారులు, ప్రజలు పాల్గొని యోగాసనాలు వేశారు.

కలిసికట్టుగా పనిచేద్దాం..

(మొదటిపేజీ తరువాయి)

శాసన సభ్యులు బి యన్ విజయ్ కుమార్, బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజులతో కలిసి తెలుగుదేశం పార్టీ జెండా ఆవిష్కరించి, స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు కార్యకర్తలను ఉద్దేశించి కీలక ప్రసంగం చేశారు. ప్రతి కార్యకర్తను సంతోషపరిచేలా అందరికీ న్యాయం చేయాలన్న సదుద్దేశంతోనే తాను పనిచేస్తున్నానని ఆయన స్పష్టం చేశారు. కూటమి పార్టీల్లోని ప్రతి ఒక్కరినీ సంతృప్తి పరిచేలా పనిచేయడమే తన లక్ష్యమన్నారు. 5 ఏళ్ల పాటు భయభ్రాంతులతో బతికిన కూటమిపార్టీల కార్యకర్తలు, నాయకులు అందరూ బేధాభిప్రాయాలను పక్కనపెట్టి పనిచేయాలని అయన సూచించారు. పాతతరం ఆలోచనలు విడనాడి కాలానుగుణంగా అందరూ మైండ్‌సెట్ మార్చుకోవాలన్నారు. ముఖ్యంగా గ్రామాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని అందరూ కలిసి నడవాలన్నారు. ఇతరపార్టీల్లోని వారు అధికార పార్టీల్లో చేరతామన్నా, భేషజాలు లేకుండా వారిని కలుపుకోవాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిపార్టీలే విజయం సాధించాలన్నారు. అందరం ఐక్యంగా ఉంటే సాధించలేనిది ఏదీ ఉండదన్నారు. ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు తన అనుభవంతో రాష్ట్రాన్ని గట్టెక్కించేందుకు ఎంతో కష్టపడుతున్నారనే వాస్తవాన్ని అందరూ గుర్తించాలన్నారు. సామాజిక పింఛన్ రూ.4వేలు రాష్ట్రంలో తప్ప దేశంలో ఎక్కడా ఇవ్వడం లేదన్నారు. కొత్త రేషన్ కార్డులతో పాటు మూడు నెలల్లోనే సూపర్ 6 పథకాలన్నీ ప్రభుత్వం అమలుచేయనుందన్నారు. నియోజకవర్గంలో కూటమిపార్టీల శ్రేణులపై ఈగకూడా వాలనివ్వకుండా చూస్తానని, ఎవరికీ అంత ధైర్యం కూడా లేదనే వాస్తవాన్ని మూడుపార్టీల శ్రేణులు గ్రహించాలని సూచించారు. కూటమిపార్టీలు సమన్వయంతో, ఐకమత్యంగా ముందుకు వెళ్లాలని, అప్పుడే 15 ఏళ్లపాటు మూడుపార్టీలు అధికారంలో ఉంటాయని తెలిపారు. కూటమిప్రభుత్వం అధికారంలో జగన్ కుట్రలు, కుతంత్రాలు సాగవన్నారు. మద్యం కుంభకోణంలో జగన్ జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. రాష్ట్రం బాగుపడాలనుకునే వారంతా ఆయన జైల్లోనే ఉండాలని కోరుకుంటున్నారన్నారు. జగన్ జైలుకు వెళితే రాష్ట్రానికి పెట్టుబడులు రావడం పెరుగుతుంద ని, తద్వారా పరిశ్రమలు ఏర్పాటవుతాయన్నారు. నియోజకవర్గంలోని ముస్లిం మైనారిటీ ఆడబిడ్డల విద్య, సంక్షేమం దృష్ట్యా తీసుకొచ్చిన పథకాన్ని దుర్మార్గపు ప్రభుత్వం పక్కనపెట్టిందని, త్వరలోనే దాన్ని పునఃప్రారంభిస్తామన్నారు. నియోజకవర్గం లోని అన్ని లిఫ్ట్ ఇరిగేషన్లను బాగుచేసేందుకు ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నా మని, అన్నీ పూర్తయితే నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు నీరందుతుందన్నారు. నియోజక వర్గానికి సంబంధించి పెండింగ్ లో ఉన్న అన్ని అభివృద్ధి పనుల్ని ఎంపీ సహకారంతో పూర్తి చేస్తానని స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో కూటమిపార్టీలకు 92శాతం సక్సెస్ రేటు రావడం అనేది అన్నివర్గాల ప్రజల వల్లనే సాధ్యమైందని, అదే స్వర్గీయ ఎన్టీఆర్ కు నిజమైన నివాళి అని నరసరావుపేట ఎంపీ అన్నారు. టీడీపీకి గెలుపోటములు సహజమన్నారు.

ప్రశ్నార్థకంగా ఒంగోలు ట్రిబుల్ ఐటీ

విశాలాంధ్ర -ఒంగోలు : ఒంగోలు ట్రిపుల్ ఐటీ భవితవ్యం ప్రశ్నార్ధకంగా మారింది. శాశ్వత భవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నేడు నెలకొంది. 2008లో ప్రారంభమైన ఒంగోలు ట్రిపుల్ ఐటీ నిర్మాణానికి కనిగిరి నియోజకవర్గంలో భూములు కేటాయించారు. అయితే అప్పటినుండి ఇప్పటివరకు ఎటువంటి భవన నిర్మాణాలు చేపట్టలేదు. ప్రారంభ రోజులలో ఒంగోలు ట్రిపుల్ ఐటి విద్యార్థులను ఇడుపులపాయ ట్రిపుల్ ఐటి కళాశాలలో ఉంచి విద్యను బోధించారు. దీంతో ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఒంగోలు ట్రిపుల్ ఐటి విద్యార్థులను వేధించటం ప్రారంభించారు. పరిస్థితిని గమనించిన అప్పటి విద్యా శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు ఒంగోలు త్రిబుల్ ఐటీని ఒంగోలుకు తరలించారు. ఇంటర్ విద్యార్థులను ఇడుపులపాయలోనే చదివిస్తూ, బీటెక్ ప్రథమ సంవత్సర విద్యార్థులను ఒంగోలు రావు అండ్ నాయుడు కళాశాలలో ఉంచారు. బీటెక్ ద్వితీయ, తృతీయ, చివరి సంవత్సర విద్యార్థులను సంతనూతలపాడు సమీపంలోని ఎస్ఎస్ఎల్ ఇంజనీరింగ్ కళాశాలను లీజుకు తీసుకొని ఉంచారు. రావ్ అండ్ నాయుడు కళాశాలలో బీటెక్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు దాదాపు 1400 మంది ఉండగా, ఎస్ఎస్ఎన్ ఇంజనీరింగ్ కళాశాలలో దాదాపు 5 వేల మంది బీటెక్ మిగిలిన మూడు సంవత్సరాలు విద్యార్థులు ఉంటున్నారు. రావ్ అండ్ నాయుడు కళాశాల లీజు ఈ సెప్టెంబర్ తో ముగియనుంది. అయితే ఈపాటికి వివాదాలలో ఉన్న ఆ కళాశాలను వెంటనే విద్యార్థులు ఖాళీ చేయాలంటూ యాజమాన్యం నుండి ఒత్తిడి పెరిగింది. ఎస్ఎస్ఎన్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉన్న 5వేల మంది విద్యార్థులతో కళాశాల ఇప్పటికే కిక్కిరిసి ఉంది. రావ్ అండ్ నాయుడు కళాశాలలో చదువుతున్న బీటెక్ ప్రథమ సంవత్సరం 14 వందల మంది విద్యార్థుల భవిష్యత్తు నేడు ప్రశ్నార్ధకంగా మారింది. దీంతో బుధవారం ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావును ఒంగోలు త్రిపుల్ ఐటీ అధ్యాపక బృందం కలిసింది. వెంటనే బీటెక్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు వసతి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో విద్యార్థులను ఇడుపులపాయ ట్రిపుల్ ఐటి కళాశాలకు తరలించవలసి వస్తుందని పేర్కొన్నారు. దీంతో దామచర్ల ఇప్పటివరకు ఏం చేస్తున్నారని, సమస్యను ముఖ్యమంత్రి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకుపోయి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గతంలో త్రిబుల్ ఐటీ ఒంగోలులో ఏర్పాటు చేసేందుకు యూనివర్సిటీ ప్రతినిధులు 3వందల ఎకరాలు కావాలని అడిగారని, ఒంగోలులో ఆ పరిస్థితి లేనందున ట్రిపుల్ ఐటీని కనిగిరి ప్రాంతానికి తరలించవలసి వచ్చిందని గుర్తు చేశారు. అయితే కనిగిరి ఎమ్మెల్యే త్రిబుల్ ఐటీ తన నియోజకవర్గ పరిధిలోనే ఉండాలని గట్టిగా పట్టు పట్టి ఉన్నారని పేర్కొన్నారు. ఒంగోలు నియోజకవర్గ పరిధిలో 30 ఎకరాలు భూమి కేటాయించిన ఒంగోలు త్రిపుల్ ఐటీకి స్థలం సరిపోతుందని ఈ సందర్భంగా త్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయారు. అయితే తాను 50 ఎకరాలు భూమి ఇప్పించేందుకు సిద్ధంగా ఉన్నానని, ఇటీవల కాలంలో ట్రిపుల్ ఐటీ ని కనిగిరి నియోజకవర్గంలో ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేశారని, ఆయన మాటకు గౌరవిస్తూ ఒంగోలు ట్రిపుల్ ఐటీ ని కనిగిరి ప్రాంతంలోని ఏర్పాటు చేసేందుకు సన్నద్ధమైనట్లు పేర్కొన్నారు. ఏది ఏమైనా ఒంగోలు ట్రిపుల్ ఐటీ బీటెక్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఒంగోలులోనే వసతి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యుత్, ఫైబర్ నెట్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - తాళ్లూరు: తాళ్లూరులో బుధవారం విద్యుత్ టవర్స్‌కు విద్యుత్ తీగలను ఏర్పాటు చేసే క్రమంలో మధ్యాహ్నం నుండి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడినది. గత ఆదివారం కూడ విద్యుత్ టవర్స్ కు తీగలు ఏర్పాటు చేసే క్రమంలో ఫైబర్ నెట్ తీగలు మొత్తం తెగిపోయాయి. దీంతో గత నాలుగు రోజులుగా ఫైబర్ నెట్ సేవలు ఆగిపోయాయి. తాళ్లూరులో బుధవారం కొంత మేర ఫైబర్ నెట్ సేవలు అందించినప్పటికి పూర్తి స్థాయిలో వినియోగదారులకు సేవలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫైబర్ నెట్‌కు ఆదరణ పెరుగుతున్న సమయంలో ఇటువంటి అంతరాల వలన సేవలు అందక వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా బి ఎస్ ఎన్ ఎల్ అధికారులు స్పందించి త్వరితగతిన స్పందించి ఫైబర్ నెట్ సేవలు అందించాలని వినియోగదారులు కోరుతున్నారు.

సమాచార విప్లవ పితామహుడు రాజీవ్ గాంధీ

బీ.ఆర్ గౌస్

విశాలాంధ్ర-ఒంగోలు : మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త బి.ఆర్ గౌస్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి మరియు స్థానిక మంగమూరు రోడ్డులోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బిఆర్ గౌస్ మాట్లాడుతూ భారతదేశ ఐక్యత కాపాడాలన్న రాజీవ్ గాంధీ గారి సిద్ధాంతమే నేడు అందరికీ ఆదర్శం అని, మన దేశ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి పితామహుడుగా, టెలికమ్యూనికేషన్ విప్లవంతో దేశాన్ని 21వ శతాబ్దంలోకి తీసుకెళ్లిన దార్శనికుడిగా రాజీవ్ గాంధీ గారు చెరగని ముద్ర వేశారని అన్నారు. గ్రామ స్వరాజ్య సాధనకు పునాదులు వేసి, స్థానిక సంస్థల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు, యువతకు 18ఏళ్లకే ఓటు హక్కు కల్పించి, దేశానికి సాంకేతిక విద్యను పరిచయం చేసి, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చిన నవ భారత నిర్మాత మన రాజీవ్ గాంధీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం కార్యనిర్వాహక అధ్యక్షులు ఉద్దండి మల్లికార్జునరావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ మన్నం ప్రసన్న రాజు, జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు షేక్ రసూల్ పాల్గొన్నారు.

'క్విస్' ఎన్‌సీసీ క్యాడెట్లకు అవార్డులు

విశాలాంధ్ర-ఒంగోలు : స్థానిక క్విస్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి బెస్ట్ క్యాడెట్లుగా అవార్డులు అందుకున్నారు. ఒంగోలు ఆర్జేయూ కేటీలో ఈనెల 12 నుంచి 21 వరకు జరిగిన యాన్యువల్ ట్రైనింగ్ క్యాంప్ - 2లో క్విస్ కళాశాలకు చెందిన ఎన్ సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు. క్యాంప్‌లో భాగంగా నిర్వహించిన ఆర్మీ డ్రిల్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పూర్ణిమ బెస్ట్ క్యాడెట్‌గా నిలిచింది. టెంట్ పిచ్చింగ్ కాంపిటీషన్‌లో అత్యంత తక్కువ టైంలో టెంట్ వేసిన ఉపదేశ్, విజయ్, అభిషేక్, హరిశంకర్, జయంత్, కరీంభాష, వెంకటేశ్ మొదటి బహుమతి సాధించారు. దాంతో పాటుగా తల్ సైనిక్ షూటింగ్, అబస్టకల్ ట్రైనింగ్ లో ప్రతిభ కనబరిచిన వెంకటేశ్, జయంత్, హేమసాయి, విజయ్, అభిషేక్, ఉపదేశ్‌లు చీరాలలో జరగబోయే తదుపరి క్యాంప్‌కి ఎన్నికయ్యారు. ప్రకాశం జిల్లా నుంచి కేవలం క్విస్ కళాశాల విద్యార్థులు మాత్రమే నెక్స్ట్ లెవెల్ ట్రైనింగ్ కి ఎన్నికైనట్లు ఎన్ సీసీ చీఫ్ రమణయ్య తెలియజేశారు. బహుమతులు, అవార్డులు సాధించిన క్యాడెట్లను, వారికి ట్రైనింగ్ ఇచ్చిన రమణయ్య, ఎన్ సీసీ డీన్ డాక్టర్ వాసుబాబు, శ్రీనీలాయ్ ని క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ శ్రీ గాయత్రి అభినందించారు. కార్యక్రమంలో ఇంఛార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ ప్రశాంత్, బీఎస్ హెచ్ హెచ్ వోడీ డాక్టర్ జి. శ్రీనివాసరావు, సీఎస్ ఈ హెచ్ వోడీ డాక్టర్ బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

బిల్డింగ్‌పై నుండి దూకి వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర-ఒంగోలు : నిర్మాణంలో ఉన్న అపార్టుమెంట్‌పై నుండి వ్యక్తి దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఒంగోలు పట్టణంలోని నెహ్రూ నగర్ ఎక్స్టెన్షన్‌లో భూమిరెడ్డి శ్రీనివాసరెడ్డికు చెందిన అపార్ట్మెంట్ వర్క్ జరుగుతుండగా గుర్తు తెలియని వ్యక్తి రెండవ ఫ్లోర్లోకి ఎక్కి కిందకి దూకడంతో పక్కన బిల్డింగుపై పడి రక్త గాయాలు కావడంతో తాలూకా పోలీస్ సిబ్బంది 108 అంబులెన్స్ లో రిమ్స్ హాస్పటల్‌కు పంపినారు. ఆసుపత్రికి వెళ్లగా డాక్టర్ చెక్ చేసి మార్గమధ్యంలో మృతి చెందినట్లు చెప్పారు.

రూబెల్లా వ్యాక్సిన్‌కు ప్రత్యేక డ్రైవ్ నిర్వహణకు కార్యాచరణ

విశాలాంధ్ర - తాళ్లూరు: మజిల్స్ రూబెల్లా నివారణకు తూర్పుగంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరధిలో ప్రత్యేక ప్రణాళిక (డ్రైవ్) రూపొందించినట్లు ప్రాథమిక కేంద్రం వైద్యాధికారి మౌనిక , వైద్యులు శ్రీకాంత్ తెలిపారు. మజిల్స్ రూబెల్లా వ్యాధి వచ్చిన పిల్లలు జ్వరంతో పాటు నిమోనియా వ్యాధి రావటంతో పాటు ఒంటి పై దద్దుర్లు వస్తాయని పిల్లలకు శారీరక పెరుగుదల తగ్గుతుందని తెలిపారు. పది నెలల చిన్నారుల నుండి 18 నెలల వరకు వ్యాక్సిన్ ఇవ్వనున్నట్లు చెప్పారు. మొదట విడుతగా ఈనెల 26 నుండి 31 వరకు, రెండవ విడుత జూన్ 23 నుండి 26 వరకు , జులై 21 నుండి 26 వరకు మూడు విడుతలుగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆరోగ్య కేంద్రం పరధిలోని సచివాలయాలో , గ్రామాలలో చిన్నారుల తల్లిదండ్రులు విషయాన్ని గమనించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

గ్రంథాలయం విజ్ఞాన వికాసం

విశాలాంధ్ర-గిద్దలూరు : గిద్దలూరు నగర పంచాయతీ పరిధిలోని శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి శిక్షణ తరగతులను విశ్రాంత ప్రధానోపాధ్యాయులు డి.వెంకటేశ్వర్లు బుధవారం సందర్శించారు. తదుపరి విద్యార్థులకు చక్కటి గణిత బోధన చేసి మాట్లాడుతూ వేసవి సెలవుల దృశ్య విలువైన సమయాన్ని వృధా కాకుండా విద్యార్థినీ విద్యార్థులు సృజనాత్మకతను నైపుణ్యతను వెలికి తీసేందుకు ప్రతిరోజు ఉదయం 8:00 గంటల నుండి 11 గంటలవరకు జరుగుతున్న వేసవి శిక్షణ తరగతులకు హాజరై గ్రంథాలయంలోఉన్న పుస్తకాలను దినపత్రికలను చదివి విజ్ఞానం పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకురాలు ప్రసన్నకుమారి విశ్రాంత ప్రధానోపాధ్యాయులు రామిరెడ్డి విశ్రాంత లైబ్రరీయన్ జయరామిరెడ్డి నిత్యసాయి ఫరూఖ్ పాల్గొన్నారు.

భూగర్భ జలాలను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - తాళ్లూరు: మేనెలలో రోహిణి కార్తేలో విపరీతమైన ఎండలు ఉండాల్సిన సమంయలో అందుకు బిన్నంగా వాతావరణం ఉందని విస్తారంగా వర్షాలు కురుస్తూ ఉన్నాయని వ్యవసాయాధికారి ప్రసాద రావు అన్నారు. వర్షపు నీటిని సద్వినియోగం చేసుకుని భూ గర్భ జలాలను పెంపొందించుకోవాలని చెప్పారు. పచ్చి రొట్ట విత్తనాలు చల్లి పశువుల మేతగా ఉపయోగించుకోవాలని కోరారు. 40 రోజుల వరకు ఎపుగా పెరిగిన తర్వాత భూమిలో బాగా కలియ దున్నాలని చెప్పారు. తాళ్లూరులో బుధవారం సాయంత్రం మళ్లీ వర్షం కురిసింది. గత మూడు రోజుల నుండి ప్రతిరోజు తాళ్లూరులో వర్షపాతం నమోదు అవుతున్నది. 40.6 మి.మీల వర్షపాతం నమోదు అయినది.

ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావం

విశాలాంధ్ర-గిద్దలూరు : పట్టణంలో ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడం పై సంఘీభావం తెలుపుతూ స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ముందుగా గాంధీ బొమ్మ సెంటర్‌లో గాంధీ మహాత్ముడికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గాంధీ బొమ్మ సెంటర్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు బైక్ ర్యాలీ ర్యాలీ కొనసాగించారు. ర్యాలీలో మాజీ ఆర్మీ ఉద్యోగులతో పాటు ఎన్డీఏ కూటమి కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మాట్లాడుతూ పహల్‌గామాలో 26 మంది అమాయక టూరిస్టులను ఉగ్రవాదులు పొట్టన పెట్టుకున్నారని మన దేశంతో పాటు కాశ్మీర్ అభివృద్ధి చెందుతుందని ఓర్వలేక పాకిస్తాన్ ప్రభుత్వం, ఉగ్రవాదులతో చేతులు కలిపి దాడులు చేయించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి దాడులకు భారతదేశం భయపడదని ఆపరేషన్ సింధూర్ పేరిట కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదులను ఎరివేసి పాకిస్తాన్ కు గుణపాఠం చెప్పిందని అన్నారు. ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావటానికి కృషి చేసిన త్రివిధ దళాలకు నా సెల్యూట్ అని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి అన్నారు. జై సింధూర్ జై భారత్ అని నినాదాలతో గిద్దలూరు పట్టణం మారుమోగింది. కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా భారీగా పాల్గొన్నారు.

జ్యూలరీ షాప్‌లో భారీ దొంగతనం

విశాలాంధ్ర - కనిగిరి : స్థానిక బొడ్డు చావిడి సెంటరులోని అచ్యుత పద్మ శివ జ్యూలరీ షాప్‌లో 2 లక్షల 40 వేల రూపాయల విలువ చేసే బంగారు ఆభరణాలు దొంగిలించబడ్డాయి. మంగళవారం ఉదయం అచ్యుత పద్మ పనిమీద ఎమ్మార్వో ఆఫీస్ కి వెళ్లిన సమయంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు షాపులోకి జొరబడి 2 లక్షల 40 వేల రూపాయలు విలువచేసే బంగారు ఆభరణాలు దోచుకెళ్లినట్లు షాప్ యజమాని అచ్యుత పద్మ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఎస్సై టి శ్రీరామ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సిఐ ఖాజావలి, హనుమంతునిపాడు ఎస్సై మాధవరావు ఎస్సై శ్రీరామ్ తో కలిసి సంఘటనా స్థలాన్ని పర్యవేక్షించారు.

కష్టజీవుల కోసం సీపీఐ నిరంతర పోరాటం

విశాలాంధ్ర-త్రిపురాంతకం :
త్రిపురాంతకం మండల మహా సభలను సీపీఐ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బాణాల రామయ్య ఆధ్వర్యంలో బుధవారం సీపీఐ కార్యాలయం వద్ద జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా మన్నెం అచ్చమ్మ, మండల కార్యదర్శి బాణాల రామయ్య వ్యవహారించారు. సీపీఐ జండాను పలుకురి చిన్న రామయ్య ఆవిష్కరించడం జరిగింది. ప్రజా నాట్యమండలి నాయకులు గుంటూరు వెంకటేశ్వర్లు అతని బృందం ఉద్యమ గీతాలను ఆలపించారు. అసువులు బాసిన నాయకుల ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ సంతాప తీర్మానం కృష్ణ గౌడ్ ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గం కార్యదర్శి డి శ్రీనివాస్ మాట్లాడుతు కష్ట జీవులకోసం పోరాడుతున్న పార్టీ కమ్యూనిస్ట్ పార్టీ అన్నారు. భూస్వాములు, పెత్తం దారుల వద్ద వున్నా అన్యాక్రాంత భూములను పంచేందుకు నిరంతరం పోరాడుతున్న పార్టీ కమ్యూనిస్ట్ పార్టీ అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో స్వాతంత్ర్యం సాధించడంలో ప్రముఖ పాత్ర పోషించిన పార్టీ కమ్యూనిస్ట్ పార్టీ అన్నారు. చండిగర్‌లో జరుగు మహా సభను జయప్రదం చేయడానికి గ్రామ కమిటీ నుండి జిల్లా రాష్ట్ర కమిటీలు ఎన్నుకొకోవడం జరుగుతుంది అన్నారు. కేంద్రంలో ఆర్ యస్ యస్ కనుసన్నలో నడుస్తున్న పార్టీ బిజెపి అని అన్నారు. ఎన్నికల వాగ్దానంలో నల్లదనం వెలికి తెస్తామని ఇంతవరకు ఎందుకు బయటకు తీసుకురాలేక పోయారని ప్రశ్నించారు. కార్మిక హక్కు చట్టాలను నిర్వీర్యం చేసిన ప్రభుత్వం బిజెపి ప్రభుత్వం అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రవేటు పరంచేసినా ప్రభుత్వం బిజెపి ప్రభుత్వం అన్నారు. 750 మంది రైతులు పెద్ద ఎత్తున రైతుల చట్టాలను కాపాడేందుకు ఉద్యమం చేయడం జరిగిందని, విజయం సాదించడం జరిగింది అన్నారు. 5 వ మండల మహా సభలకు నుండి నేటివరకు జరిగిన కార్యక్రమాలకు సంబందించన వివరాలను సీపీఐ మండల కార్యదర్శి బాణాల రామయ్య వివరించడం జరిగింది.వాటిని జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణ గౌడ్,నియోజకవర్గ కార్యదర్శి డి శ్రీనివాస్, సీనియర్ నాయకులు రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సహాయ కార్యదర్శి మల్లికార్జున,సీపీఐ నాయకులు వెంకటేశ్వర్లు, పవన్ కుమార్,దొరబాబు,ఆదినారాయణ,నుర్జహాన్, ఆదిలక్ష్మి,వెంకటరావు పాల్గొన్నారు.

'ఉపాధి హామీ'లో డొల్లతనం

విశాలాంధ్ర-వెలిగండ్ల :
కనిగిరి నియోజకవర్గంలో ఉపాధి హామీ పనులు డోల్లతనం మెండుగా కనబడుతుంది కూలీలు ప్రతిరోజు వచ్చినప్పటికీ వారు మేటిలు తూతూ మంత్రంగా హాజరు వేస్తూ అంతేకాకుండా వారానికి ఒక్కొక్క కూలి నుండి 200 రూపాయలు ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. ఆ విధంగా ఇవ్వకపోయినాచో వారికి హాజరు సరిగా వేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇలా చూస్తే ఉపాధి హామీ సిబ్బంది దాదాపుగా లక్షల్లోనే గడిస్తున్నట్లు సమాచారం. అధికారులు ఎంత పర్యవేక్షణ చేసినప్పటికీ వారికి దొరకకుండా సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఈమధ్య చూసినట్లయితే జిల్లాలో అనేకచోట్ల ఇటువంటి సంఘటనలు వెలుగులోకి రావడం జరిగింది. ఈ పరిస్థితి ఇదే విధంగా కొనసాగితే సిబ్బందిపై పర్యవేక్షణ చేయకపోతే ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి భలే ప్రమాదం ఉన్నది కనుక ఉన్నత స్థాయి అధికారులు ఈ విషయంపై పర్యేక్షించి ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా చూడవలసిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు, కనిగిరి నియోజకవర్గంలోని కనిగిరి, హనుమంతునిపాడు, పెద్ద చెర్లోపల్లి, పామూరు, వెలిగండ్ల ,సిఎస్పురం మండలాలలో కొంతమంది అయితే వారు పనికి వచ్చినా రాకపోయినా లోపాయ కారి ఒప్పందముతో హాజరు వేస్తూ వారి వద్ద నుండి భారీగా నగదు పొందుతున్నారు ఈ విషయాలపై అధికారులు దృష్టి సారించాలని గ్రామపంచాయతీలోని ప్రజలు మల్ల గుల్లాలు పడుతున్నారు.

పోలేరమ్మ తిరునాళ్లలో ఎమ్మెల్యే 'బూచేపల్లి'

విశాలాంధ్ర-దొనకొండ:
మండలంలోని పోలేపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన పోలేరమ్మ తిరుణాలలో వైసీపీ జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే డా.బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మతో కలిసి పాల్గొన్నారు. ముందుగా పోలేరమ్మను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం గ్రామస్తులు ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ వేదికపై ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఎన్నికల హామీలను మరచి, రెడ్ బుక్ రాజ్యాంగానికి తెర తీసి వైసీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. చంద్రబాబునాయుడు ఇప్పటికే తెచ్చిన అప్పులతో ఒక్క పథకం అమలు చేయలేదంటూ విమర్శించారు. వైసీపీ పాలనలో కరోనా వంటి కష్ట కాలం వచ్చినా ఇచ్చిన హామీలు నూరు శాతం అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన ప్రజలు గమనిస్తున్నారని, అతి త్వరలోనే ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్తారంటూ శివప్రసాదరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కాకర్ల క్రిష్ణారెడ్డి, ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళీ, సర్పంచ్ యద్దనపూడి జాన్‌ప్రకాష్, బండారు రాజు, బత్తుల వెంకటసుబ్బయ్య యాదవ్, కర్నూలు రామిరెడ్డి, ఐలూరి శ్రీనివాసరెడ్డి, ఇండ్ల శ్రీనివాసులు, పులిమి శివ, కె.ప్రసాద్, గొంగటి మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.

కొండపిలో కార్డెన్ సెర్చ్

60 ద్విచక్ర వాహనాలు సీజ్

విశాలాంధ్ర-కొండపి : కొండపిలో 70 మంది పోలీసులు బుధవారం కార్డెన్ చర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కొండపి సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.సోమశేఖర్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్ ఉత్తర్వుల మేరకు కనిగిరి ఎస్డిపిఓ సూచనలతో కొండేపి మండల పరిధిలో గొడుగుల పాలెం, కొత్త కుమ్మ రిపాలెం నందు కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ని నిర్వహించినట్లు తెలిపారు. అదేవిధంగా పొదిలి రోడ్, అనకర్లపూడి రోడ్డు నందు వాహన తనిఖీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు.ఈ తనిఖీలలో ఒక ఆటో తోపాటు సుమారు 60 బైకులు పైచిలుకు వాహనాలను సీజ్ చేయడం జరిగింది. వాహనాలు యొక్క సంబంధిత డాక్యుమెంట్లు పరిశీలించి వాహనాలకు జరిమానా విధించడం కానీ, వాహనాలను జప్తు చేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో ఒంగోల్ ఏ ఆర్ డి ఎస్ పి శ్రీనివాసరావు , ఎస్సై ప్రేమ్ కుమార్ ఇద్దరు రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్లు మరియు సుమారు 70 మంది సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా గాంజా తనిఖీని మరియు బెల్టు షాపులు తనిఖీని అసాంఘిక కార్యక్రమాలు జరుగు ప్రదేశాల్ని పరిశీలించడం, వాహనాలను తనిఖీ చేసి డాక్యుమెంట్ లేని వాహనాలను సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. అదే విధంగా ఈ కార్యక్రమంలో డాగ్స్ స్క్వాడ్ మరియు రోబో డ్రస్ పార్టీని, స్పెషల్ పార్టీని, ఏఆర్ పార్టీని మరియు వజ్ర వాహనాన్ని కూడా ఉపయోగించడం జరిగింది. ప్రజలు అప్రమత్తతో ఉండి మీ నివాస ప్రదేశాల్లో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లయితే సమాచారాన్ని పోలీసులకు తెలియ పరచాలని సర్కిల్ ఇన్స్పెక్టర్ సోమశేఖర్ ప్రజలకు సూచించారు.

రేపటినుంచి గంగమ్మ తిరునాళ్ల

విశాలాంధ్ర-సిఎస్‌పురం : మండల కేంద్రమైన సిఎస్పురం పట్టణంలోని డీజీ పేట రోడ్‌లో ఉన్న గంగమ్మ తల్లి దేవస్థానం మొదటి వార్షికోత్సవ సందర్భంగా ఈనెల 23 శుక్రవారం నుండినుండి 25 ఆదివారం వరకువ గంగమ్మ తల్లి తిరుణాల అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు దేవస్థానం కమిటీ వారు తెలిపారు. శుక్రవారం పుట్ట బంగారం తీసుకొని వచ్చుట సాయంత్రం వివిధ వేషధారణలతో కనక తప్పెట్లతో బాణాసంచా వేడుకలతో కోలాటం ప్రదర్శన మరియు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అంగరంగ వైభవంగా గ్రామ వీధుల నుండి గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు అదేవిధంగా రెండో రోజు శనివారం ముద్ద పోలు కార్యక్రమం సాయంత్రం రాయబార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చివరి రోజు అయిన ఆదివారం పొంగళ్ళు నైవేద్యం సమర్పించిన అనంతరం మహా అన్నదాన కార్యక్రమం ఇస్తున్నట్లు కావున నియోజకవర్గంలోని ప్రజలు గంగమ్మ తల్లి భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు అందుకోవాలని కమిటీ వారు తెలిపారు.

ఆధార్ పెండింగ్ లేకుండా చూడాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : సచివాలయాల పరిధిలో చిన్నారులకు సంబంధించిన ఆధార్ వివరాలు పెండింగ్ లేకుండా చూడాలని ఎంపీడీవో పి సునీత అన్నారు. మండలంలోని ఉలగల్లు సచివాలయాన్ని బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయాల సేవలు ప్రజలకు అందుతున్నాయా లేదా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా పెండింగ్ ఆధారపై దృష్టి పెట్టాలన్నారు. మనమిత్ర సేవలు పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సచి వాలయాల్లో దరఖాస్తు చేసుకున్న వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు ఎప్పటికప్పుడు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

కార్యకర్తే పార్టీకి అధినేత

- కార్యకర్తల కృషి ఫలితమే ఎన్డీయే కూటమి ప్రభుత్వ విజయం
- 27, 28, 29 తేదీల్లో కడపలో మహానాడు విజయవంతం చేద్దాం
- గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల

విశాలాంధ్ర-గిద్దలూరు : కార్యకర్తే టీడీపీకి అధినేత అని, బడుగు బలహీన వర్గాలకు అండగా ఉండే పార్టీ అని తెలుగుదేశం అని, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి అన్నారు. పట్టణంలోని విట్టా సుబ్బరత్నం కళ్యాణ మండపంలో ఎమ్మెల్యే అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ మహానాడు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొదటగా ఎమ్మెల్యే అశోక్ రెడ్డి స్వర్గీయ నందమూరి తారకరామారావు చిత్ర పటానికి నివాళులు అర్పించి, తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అండతో పుట్టిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని ఎమ్మెల్యే అన్నారు. అధికారంలో ఉన్న లేకపోయినా కార్యకర్తలకు సీఎం చంద్రబాబు నాయుడు గారు ఎల్లప్పుడూ అండగా ఉన్నారని, గతంలో పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి ప్రమాద భీమా ద్వారా రూ. 2 లక్షలు అందిస్తే, ప్రస్తుతం రూ. 5 లక్షలకు పెంచడం జరిగిందని అన్నారు. ఇటీవల నియోజకవర్గలో రోడ్డు ప్రమాదంలో మరణించిన కార్యకర్తల కుటుంబాలకు కూడా ఒక్కొక్కరికి రూ. 5 లక్షలు పరిహారం అందించడం జరిగిందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు రాజ్యాధికారం ఇచ్చిన ఘనత స్వర్గీయ ఎన్టీఆర్ కే దక్కుతుందన్నారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత రాష్ట్రానికి పెద్ద దిక్కుల సీఎం చంద్రబాబు 2014లో నిలబడ్డారని రాష్ట్రం అభివృద్ధి చెందుతున్న తరుణంలో ప్రస్తుత మాజీ సీఎం జగన్ మోసపూరితమైన హామీలు ఇచ్చి 2019లో అధికారంలోకి వచ్చారని అన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఇష్టానుసారంగా వ్యవహరించారాని రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి దివాలా తీసేలా చేశారన్నారు. తిరిగి రాష్ట్రాన్ని చంద్రబాబు బాగు చేస్తున్నారని అన్నారు. అన్ని వర్గాల వారిని ఆదుకుంటూ ఇచ్చిన హామీలన్నిటిని నిలబెట్టుకుంటూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. ఈ నెల 27, 28, 29 తేదీలలో కడపలో జరిగే మహానాడు కార్యక్రమాన్ని కార్యకర్తలు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి పిలుపునిచ్చారు. కమానికి కార్యకర్తలు భారీగా తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, జడ్పీటీసీ సభ్యులు, మార్కెట్ యార్డ్, నగర పంచాయతీ, సొసైటీ బ్యాంకు చైర్మన్లు, మాజీ జడ్పీటీసీలు, ఎంపీపీలు, ప్రధాన కార్యదర్శులు, తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

దేశ శ్రేయస్సు విద్యార్థుల బాధ్యత

విశాలాంధ్ర-ముండ్లమూరు : ఎన్ సీసీ విద్యార్థిని, విద్యార్థులు దేశ శ్రేయస్సు కోసం పాటుపడాలని 34వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్(సి ఓ) మోహన్, మరియు ఎన్ సిసి సుబేదార్ మేజర్ పుష్పరాజు అన్నారు. ఒంగోలులోని రాజీవ్ గాంధీ త్రిబుల్ ఐటీ లో ఈనెల 12వ తేదీ నుండి 34 బెటాలియన్ ఎన్ సీసీ విద్యార్థిని విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్ సీసీ విద్యార్థిని విద్యార్థు లకు కావలసిన డ్రిల్స్ ను ఎంతో కఠినమైన శిక్షణ నేర్పించి ఉత్తమ విద్యార్థిని విద్యార్థులుగా పౌరులుగా సమాజంలో రాణించే విధంగా తయారు చేశారు. మిలటరీ స్టాప్ విద్యార్థులకు మంచి క్రమశిక్షణ నడవడిక ఐక్యత మరియు దేశభక్తి భారత విశిష్టతను గురించి విద్యార్థులకు వివరించి అందరిని అభినందించారు. ఈ కార్యక్రమాన్ని ఎన్ సీసీ మాస్టారు సాదు వెంకటేశ్వర రెడ్డి పది రోజులుగా పర్యవేక్షించారు. అనంతరం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ కే పూర్ణచంద్రరావు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

వివాహ వేడుకల్లో కృష్ణ కిషోర్ రెడ్డి

విశాలాంధ్ర-గిద్దలూరు : మండలంలోని దేవనగరం గ్రామంలో నిడిగంటి రంగస్వామి కుమారుడు రఘు, లక్ష్మి సౌమ్యలకు జరిగిన వివాహ కార్యక్రమంలో గిద్దలూరు ఎమ్మెల్యే సోదరుడు ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, సొసైటీ బ్యాంకు చైర్మన్ ముచ్చుకుంట్ల రామసుబ్బయ్య, మాజీ సర్పంచ్ రంగస్వామి, నరసింహులు, వెంకటేశ్వర్లు, మల్లిఖార్జున పాల్గొన్నారు.

హెచ్ఐవీ నియంత్రణపై అవగాహన

విశాలాంధ్ర - సింగరాయకొండ : సింగరాయకొండ మండల పరిధిలోని పాకల గ్రామంలో సీజనల్ వ్యాధులు,దీర్ఘకాలిక వ్యాధులు ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన కార్యక్రమం చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ , ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ మరియు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం కళాజాత అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో కళాజాత బృంద సభ్యులు హెచ్ ఐ వి 4 మార్గాల ద్వారా వస్తుందని 1. సురక్షితం కాని లైంగిక సంబంధాలు 2. కలుషితమైన రక్త మార్పిడి 3. శుభ్రపరచని సూదులు, సిరంజీలు వాడడం వలన 4. హెచ్ ఐ వి సోకిన తల్లి నుండి బిడ్డకు ఈ మార్గాల ద్వారా తప్ప ఇక ఏ విధంగా రాదని తెలియజేసి హెచ్ ఐ వి ఉన్న వారి పట్ల వివక్షత,చిన్నచూపు తగదని వారికోసమై భారత ప్రభుత్వం ఎయిడ్స్ 2017 చట్టం అమలు చేస్తున్నట్లు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక లింక్ వర్కర్ రెబ్బవరపు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ తరగతులు

విశాలాంధ్ర - బేస్తవారి పేట : స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను గ్రంథాలయాలకు పంపించాలని సూచించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు పీవీ గురుస్వామి విద్యార్థులకు క్విజ్, ఇంగ్లీష్ గ్రామర్, స్పోకెన్ ఇంగ్లీష్ నేర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో 12మంది విద్యార్థులు పాల్గొన్నారు.

సమన్వయంతో మండలాభివృద్ధికి కృషి చేయాలి

విశాలాంధ్ర - నిజాంపట్నం : మండలంలోని అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కలిసి పని చేసి మండలాభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ మోపిదేవి విజయ నిర్మల అన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మోపిదేవి విజయ నిర్మల అధ్యక్షతన ఎంపీడీవో ఎన్.నాగలక్ష్మి ఆధ్వర్యంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తొలుత మండల అధికారులు వారి శాఖలకు సంబంధించిన అభివృద్ధి, ప్రభుత్వ పథకాల ప్రగతి నివేదికలను సమావేశంలో వివరించారు. సర్పంచులు, ఎంపీటీసీలు గ్రామాలలో నెలకొన్న పలు సమస్యలను ఎంపీపీకి విన్నవించుకోగా తక్షణమే ఆ సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎంపీపీ ఆదేశించారు. గ్రామాలలోని ప్రజల సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ త్వరితగతిన పరిష్కరించాలన్నారు. సర్వసభ సమావేశంలో గుర్తించిన సమస్యలను సత్వరమే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఆదేశించారు. తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లోని నిరుపేదలకు 3 సెంటుల ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. అలాగే కొత్త రైస్ కార్డుల కొరకు దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు. అర్హులైన కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు మంజూరు చేస్తున్నామని చెప్పారు. మండలంలోని ముత్తుపల్లిలో జరుగుతున్న రీ-సర్వే రైతుల అభ్యంతరం మేరకు ఆగిందని మరల తిరిగి ప్రారంభించామని చెప్పారు. అడవులదీవి గ్రామంలో భూముల రీ-సర్వే ప్రారంభించామని చెప్పారు. మండలంలో రెవెన్యూ పరంగా ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ సమావేశంలో మోపిదేవి హరనాథ్‌బాబు, తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ టి.సుబ్బారావు పాల్గొన్నారు.

మినీ మహానాడుకు టీడీపీ శ్రేణులు తరలి రావాలి : రాధాకృష్ణమూర్తి

విశాలాంధ్ర - జె.పంగులూరు : ఈనెల 22వ తేదీ గురువారం అద్దంకి పట్టణంలోని కామేపల్లి కల్యాణ మండపంలో జరిగే అద్దంకి నియోజకవర్గం టీడీపీ మినీ మహానాడు సభకు జె పంగులూరు మండలం లోని ప్రతి గ్రామం నుండి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ భారీగా తరలి రావాలని ప్రతి ఒక్కరూ తప్పకుండ హాజరై కార్యక్రమంను జయప్రదం చేయాలని తద్వారా మన ప్రియతమ నాయకులు, అద్దంకి నియోజకవర్గం శాసన సభ్యులు, విద్యుత్ శాఖ మంత్రివర్యులు అయిన గొట్టిపాటి రవికుమార్ నాయకత్వాన్ని, తెలుగుదేశం పార్టీని బలోపేతం చేయాలని జె పంగులూరు మండలం తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి తెలగతోటి రాధాకృష్ణమూర్తి తెలిపారు.

వృద్ధులకు అన్నదానం

విశాలాంధ్ర - పర్చూరు : రోటరీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఆశ్రయ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం జరిగింది. రోటరీ సభ్యుడైన నాగుబైరు శ్రీనివాసరావు కుమారుడు వంశీకృష్ణ, గాయత్రీల వివాహ వార్షికోత్సవ సందర్భంగా నాగుబైరు శ్రీనివాసరావు ఆశ్రమంలోని వృద్ధులకు మే నెల మొత్తం మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేసి అన్నదానంకు వితరణ చేశారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి తోకల కృష్ణమోహన్, కోమటి ఆంజనేయులు, పంబి సదానంద రెడ్డి, సభ్యులు నాగబైరు శ్రీనివాసరావు, మున్నంగి వెంకటసుబ్బయ్య, కోట శ్రీనివాసరావు, కోడూరి సుబ్రమ్మణ్య చారి, ఆశ్రమ నిర్వాహకులు, వృద్ధులు పాల్గొన్నారు.

పొగాకు సమాచారాన్ని సేకరించాలి

విశాలాంధ్ర - పర్చూరు : రైతుల వద్ద ఉన్న పొగాకు సమాచారాన్ని సేకరించాలని వ్యవసాయ అధికారులకు ఎమ్మెల్యే ఏలూరు సాంబశివరావు సూచించారు. స్థానిక చీరాల రోడ్ లోని మహాలక్ష్మి కాంప్లెక్స్ నూతన నిర్మాణం చేపట్టగా ఎమ్మెల్యే ఏలూరి సందర్శించారు. ఏలూరి మాట్లాడుతూ రైతుల వద్ద ఉన్నా పొగాకును కొన్నామని కంపెనీలు ప్రతినిధులు ప్రభుత్వానికి నివేదిక అందిస్తున్నారని, వాస్తవానికి విరుద్ధంగా వ్యవహరించడం వలన రైతుల వద్ద ఉన్న పొగాకును గ్రామ సచివాలయాల ద్వారా నమోదు చేసి పొగాకు ఎంత మొత్తంలో ఉన్నదనేదాన్ని సమాచారాన్ని ప్రభుత్వానికి అందించాలని ఏలూరు తెలిపారు.

అద్దంకి మండలంలో వర్షం

విశాలాంధ్ర - అద్దంకి : అద్దంకి మండలంలో బుధవారం సాయంత్రం మెరుపులు ఉరుములతో వర్షం కురిసింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై మబ్బులు కొమ్ముకుని వాతావరణం లో మార్పులు వచ్చాయి. సాయంత్రం కురిసిన వర్షానికి వీధి వ్యాపారులు, వాహన చోదకులు, పాద చారులు ఇబ్బంది పడ్డారు. పేదల నివసించే శివారు కాలనీలోకి వర్షపు నీరు చేరి ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షాలు మూడు రోజులపాటు ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడం జరిగింది. భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల తాసిల్దార్ శ్రీ చరణ్ సూచించారు. అవసరమైతే తప్ప బయటకు రావద్దు అన్నారు. పొలాలలకు వెళ్లేవారు చెట్ల కింద ఉండవద్దన్నారు.

నేడు తోపుడు బండ్లు పంపిణీ

విశాలాంధ్ర - అద్దంకి : అద్దంకి పట్టణంలోని కామేపల్లి కళ్యాణమండపంలో గురువారం జరిగే టిడిపి మినీ మహానాడుకు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరవుతున్నట్లు మంత్రి కార్యాలయ ప్రతినిధి బుధవారం తెలిపారు. మినీ మహానాడులో అద్దంకి పట్టణ తోపుడుబండ్ల వ్యాపారులు 150 మందికి ఉచితంగా తోపుడుబండ్లు మంత్రి గొట్టిపాటి పంపిణీ చేస్తారని కార్యాలయ ప్రతినిధి తెలిపారు.

పీహెచ్‌సీ డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - చీరాల రూరల్ : మండలంలోని ఈపురు పాలెం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్ఓ విజయమ్మ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రికార్డులు తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. పరిసరాల పరిశుభ్రత గురించి, సీజనల్ వ్యాధుల గురించి ప్రజలను అప్రమత్తం చేస్తూ వారికి ఆ విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.

రాజ్యాధికారమే లక్ష్యంగా పని చేయాలి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : రాజ్యాధికారమే లక్ష్యంగా కుమారి మాయవతి పని చేస్తున్న లక్ష్యాన్ని చేరుకోవాలని యువకులు బహుజన సమాజ్ పార్టీలో చేరి రాజ్యాధికారం తీసుకురావాలని బహుజన్ సమాజ్ పార్టీ ఆశయాలు నెరవేర్చాలని నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు పాలపర్తి సంతమ్మ కోరారు. బాపట్ల పట్టణం పదవ వార్డు ప్యాడిసన్ పేటకు చెందిన కారసాల సుందర్ సింగ్‌ని బహుజన సమాజ్ పార్టీలోకి పార్టీ కండువా కప్పి ఆమె ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ గుదే రాజారావు పాల్గొన్నారు.

'షైనింగ్ స్టార్' అవార్డు అందుకున్న దివ్యశ్రీ

విశాలాంధ్ర - వేటపాలెం : ఉండవల్లిలోని విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖమంత్రి నారా లోకేష్ క్యాంప్ కార్యాలయంలో వేటపాలెం మండలం పందిళ్ళపల్లి గ్రామంలో పదవ తరగతి ఫలితాలలో మంచి ప్రతిభ కనబరిచిన దివ్యశ్రీకి విద్య ఐటి ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్ క్యాంపు కార్యాలయంలో ట్రైనింగ్ స్టార్ అవార్డుతో మంగళవారం దివ్యశ్రీని ఘనంగా సత్కరించారు. రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 47 మంది విద్యార్థులను ఆయన సన్మానించారు. పందిళ్ళపల్లి హైస్కూల్ నుండి 596 మార్కులు సాధించి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిన సజ్జా దివ్యశ్రీని మెడల్, శాలువా, తొమ్మిది పుస్తకాలను అందించి, "షైనింగ్ స్టార్"గా అభివర్ణించారు.

అసాంఘిక కార్యక్రమాల నియంత్రణకు డ్రోన్ కెమేరాలు దోహదం : ఎస్పీ

విశాలాంధ్ర - కనిగిరి: ప్రకాశం జిల్లా పరిధిలో లా అండ్ ఆర్డర్, నేరాలు, ట్రాఫిక్ నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా, విపత్తు నిర్వహణ, ఇతర పోలీసింగ్ అవసరాల కొరకు బేస్తవారిపేట మండలం, సాలకలవీడు గ్రామానికి చెందిన సాఫ్ట్వేర్ ఇంజనీర్ బిక్కు రామాంజనేయ రెడ్డి, దొనకొండ మండలం, ఎర్రబాలెం గ్రామానికి చెందిన మోదీ ఆంజనేయులు అనే వ్యక్తులు బుధవారం కనిగిరి పవిత్ర ఫంక్షన్ హాల్‌లో జిల్లా ఎస్పీకి అత్యాధునిక సాంకేతికతతో కూడిన డీజీ ఎయిర్ 3ఎస్ డ్రోన్ కెమెరాలను అందజేశారు. జిల్లా పోలీస్ శాఖకు సామాజిక బాధ్యత, సేవా స్ఫూర్తితో పోలీస్ శాఖకు డ్రోన్ లను బహుకరించడం అభినందనీయమని జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ రావు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఆ డ్రోన్‌లను బీబీ పేట, దొనకొండ పోలీస్ స్టేషన్ లకు జిల్లా ఎస్పీ అందచేశారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతలను పరిరక్షించడంలో సాంకేతికత యొక్క పాత్ర చాలా ముఖ్యమైనదని, నేరాల కట్టడికి చర్యలు చేపడుతున్నట్లు, ప్రతీ పోలీసు స్టేషను పరిధిలో చైన్ స్నాచింగ్స్, ఈవ్ టీజింగు, రహదారి ప్రమాదాలు, దొంగతనాలు, రద్దీ ఏరియాలు, అసాంఘిక కార్యకలాపాలు జరిగే ప్రాంతాలు, ఇతర నేరాలు జరిగేందుకు అవకాశం ఉన్న శివారు ప్రాంతాలను, తోటలను, బహిరంగ ప్రదేశాలను ముందుగా గుర్తించి, ఆయా ప్రాంతాలపై డ్రోన్స్ పంపి నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు.

గుంతలు కనపడకుండా కళ్లకు గంతలు కట్టుకున్నారా...

- బాపట్ల మున్సిపల్ అధికారులు స్పందించాలి
- సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ ఆగ్రహం
- పట్టణంలో గుంతలు ప్రదేశాలను సీపీఐ బృందం పరిశీలన

విశాలాంధ్ర - బాపట్ల : బాపట్ల పట్టణంలో రోడ్డుపై ఉన్న గుంతలు కనపడకుండా అధికారులు కళ్లకు గంతలు కట్టుకున్నారా అని సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ బాపట్ల మున్సిపల్ అధికారులను ప్రశ్నించారు. బాపట్ల పట్టణంలోని ప్రధాన రహదారుల్లో అధికారులు నీటి పైపులైన్ కోసం రోడ్డును తవ్వి వదిలేసిన గుంతలను సింగరకొండ సీపీఐ బృందంతో పర్యటించి పరిశీలించారు. బాపట్ల పట్టణానికి నడిబొడ్డున ఉన్న గడియార స్థంభం ప్రధాన రోడ్డు మద్యన ఏర్పడిన గుంతను పరిశీలించి మీడియాతో మాట్లాడారు. బాపట్ల పట్టణంలో 50 మీటర్లకు ఒక గుంత ఏర్పడిందని అధికారులు పైపులైన్ కోసం గుంతలు కోసం తూతూమంత్రంగా మట్టితో పూడ్చటం వలన నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. బాపట్ట పట్టణంలో ప్యాడిసన్ పేట, ఆర్ట్స్ కాలేజ్, మున్సిపల్ కార్యాలయం, కన్యకాపరమేశ్వరి గుడి, గడియార స్థంభం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సెంటర్, సినిమాహాల్ సెంటర్, దగ్గుమల్లివారిపాలెం, హైయర్‌నగర్, చెంగళరాయుడు తోట వద్ద రోడ్డును అడ్డగోలుగా పగలగొట్టిన అధికారులు పూర్తిస్థాయిలో పూడ్చకుండా వదిలేశారన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి ఎంతోమంతి కాళ్లు చేతులు విరిగిపోతున్నాయన్నారు. జగన్నాధపురం ఎదురు ఉన్న పెద్ద గుంత వద్ద ఇప్పటికే ఆరుగురు ద్విచక్రవాహనదారులు పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. అధికారులు తమకేమి పట్టన్నట్లు వ్యవహరించటం సరికాదన్నారు. అధికారుల నిర్లక్ష్యం పట్టణ ప్రజలకు శాపంగా మారిందన్నారు. ఇప్పటికైన మున్సిపల్ అధికారులు కళ్లకు పెట్టుకున్న గంతలు తీసి పట్టణంలోని ప్రధాన రోడ్డుపై ఉన్న గుంతలు పూడ్చాలని సింగరకొండ డిమాండ్ చేశారు. లేకుంటే గుంతల వద్ద సీపీఐ ఆద్వర్యంలో నిరసన దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ బాపట్ల పట్టణ కార్యదర్శి మామిడిపత్తుల అశోక్, సిపిఐ నాయకులు కంచర్ల ఏసురత్నం,మురళి,జన్సన్, మామిడి బత్తుల వెంకటేశ్వర్లు, తన్నీరు ర్యాన్ పాల్గొన్నారు.

ఘనంగా మీర్జా షంషీర్ అలీబేగ్ కుమారుడి వివాహం

- హాజరైన రాజకీయ నేతలు వైవీ సుబ్బారెడ్డి, మిథున్ రెడ్డి, సినీ నటుడు ఆలీ
- అసిస్టెంట్ కమిషనర్ (పోలీస్ క్రైం) కిరణ్ కుమార్
- ఎమ్మెల్యే తాటిపర్తి, మాజీ ఎమ్మెల్యేలు అన్నా, జంకె, ఉడుముల

విశాలాంధ్ర-మార్కాపురం : ఏ 1 గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్, ఏపి రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషీర్ అలీబేగ్ కుమారుడు మీర్జా మహమ్మద్ మసూద్ అలీబేగ్ వివాహ మహోత్సవ కార్యక్రమం హైదారాబాద్‌లో సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శు భాకాంక్షలు తెలిపిన వారిలో లోక్ సభలో వైసిపి పక్ష నేత పి.మిథున్ రెడ్డి, రాజ్య సభలో వైసిపి పక్ష నేత వైవి సుబ్బారెడ్డి,ప్రముఖ సినీ నటుడు ఆలీ, హైదారాబాద్ నగర ఎకానమీ అఫెన్స్ విభాగం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసిపి) కె ఎమ్.కిరణ్ కుమార్,మాజీ మంత్రి డాక్టర్ సురేష్, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యేలు జంకె వెంకట రెడ్డి, ఉడుముల శ్రీనివాస రెడ్డి, మాజీ డిఐజి ఎస్ కె ఇక్బాల్, కర్నూలు జిల్లా కోడుమూరు నియోజకవర్గ వైసిపి ఇన్చార్జి ఆదిములపు సతీష్, వైసిపి రాష్ట్ర కార్యదర్శి వెన్నా హనుమారెడ్డి, మార్కాపురం నియోజకవర్గ వైసిపి యువనేత కుందూరు క్రిష్ణ మోహన్ రెడ్డి, బిసి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పి ఎల్ పి యాదవ్,మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్ ఎస్ కె ఇస్మాయిల్, ఏఎంసి మాజీ చైర్మన్‌లు డివి క్రిష్ణారెడ్డి, గోలమారు శ్రీనివాస రెడ్డి,టీడీపీ రాష్ట్ర పరిశీలకులు శాసనాల వీరబ్రహ్మం, వైసిపి రాష్ట్ర ఇంటలేక్చువల్ విభాగం రాష్ట్ర సెక్రెటరీ, ఎమ్ ఎస్ ఎమ్ ఈ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మెడా బద్రీనాథ్, ఎస్ వి కె పి డిగ్రీ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ జిసిహెచ్ ధర్మానాయక్. వక్ఫ్ బోర్డు డైరెక్టర్ అబిద్ హుస్సేన్ బెగ్, జనసేన పార్టీ ఇన్చార్జి ఇమ్మడి కాశీనాథ్, జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు ఎస్ కె మహబూబ్ భాష, జిల్లా జనసేన ప్రధాన కార్యదర్శి సయ్యద్ సాదిక్,ఎన్జీవో జనరల్ సెక్రెటరీ వడ్లమాని శ్రీనివాస్, బి. ఇడి కాలేజీ ప్రిన్సిపాల్ ఎల్ వి రెడ్డి, వైసిపి పోలింగ్ బూత్ విభాగం సెక్రెటరీ పత్తి రవిచంద్ర, ప్రముఖ ఆడిటర్ తోట సత్యనారాయణ,ఏపి యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయుడబ్లూజే) ప్రకాశం జిల్లా కమిటీ అధ్యక్షులు ఎన్ వి రమణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మూల అల్లూరి రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి బంకా శ్రీనివాసరావు, వై పాలెం నియోజక వర్గ టీడీపీ నాయకులు గొట్టం శ్రీనివాస రెడ్డి, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సెక్రెటరీ గుంటక వనజాక్షి చెన్నారెడ్డి, వెంకటేశ్వ ఐటిఐ కరస్పాండెంట్ గుంపల్లి రత్నం శెట్టి, సెవెన్ హిల్స్ అధినేత తాటిపర్తి చెన్నారెడ్డి, ఏఎంసి మాజీ వైస్ చైర్మన్ పానుగంటి మురళీ,మాజీ డైరెక్టర్స్ ఊటుకూరి సురేష్, చక్కా సత్యనారాయణ, వాల్మికి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య ఎన్ఎస్ అగ్రికల్చర్ కాలేజీ చైర్మన్ నాదెళ్ల చంద్రమౌలి, రాక్‌వెల్ పబ్లిక్‌స్కూల్ అధినేత వెన్నా పోలిరెడ్డి, తదితర ప్రముఖులు వున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారికి తొలుత మీర్జా షంషీర్ అలీబెగ్, మీర్జా జాఫర్ అలీ బేగ్ సోదరులు, రాష్ట్ర మైనారిటీ కమిషన్ తాజా మాజీ చైర్మన్ డాక్టర్ ఎస్ ఇక్బాల్ స్వాగతం పలికారు.

అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణ పనులు మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ పరిశీలన

విశాలాంధ్ర-కనిగిరి : పట్టణంలోని 11వ వార్డు దేవాంగ నగర్ లో నిర్మాణంలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌ను మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ బుధవారం పరిశీలించారు. ప్రస్తుతం జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ గతంలో అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.80 లక్షలు నిధులు కేటాయించిందని,ఆ నిధులు నిర్మాణ పనులకు సరిపోకపోవడంతో పనులు అసంపూర్తిగా నిలిచిపోయా అన్నారు.మళ్లీ ఆరోగ్యశాఖ ద్వారా రూ.38 లక్షల నిధులను విడుదల చేయించడం జరిగిందని, ఆ నిధులతో అసంపూర్తిగా మిగిలిన కాంపౌండ్ వాల్, పెయింటింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. త్వరలో కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి చే నూతన అర్బన్ హెల్త్ సెంటర్ ను ప్రారంభిస్తామన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్కు వెళ్లే రోడ్డు సరి లేకుండా 15వ ఆర్థిక సంఘ నిధుల నుండి సిసి రోడ్డు మరియు ఇరువైపులా రైలు మంజూరు చేశామన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణం పూర్తయితే అక్కడి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు ఉచితంగా అందుతాయని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు.ఈ కార్యక్రమంలో చైర్మన్ తో పాటు వార్డు ఎమినిటీ సెక్రటరీ షంషేర్ కాంట్రాక్టర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సింగరాయకొండలో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్

విశాలాంధ్ర - సింగరాయకొండ : ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ఉత్తర్వుల మేరకు ఒంగోలు సబ్ డివిజనల్ ఆఫీసర్ రాయపాటి శ్రీనివాసరావు సూచనలపై సింగరాయకొండ మండల పరిధిలో చంద్రబాబు నాయుడు కాలనీ, మల్లెతోట నందు కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ ను కందుకూరు రోడ్ , రైల్వే స్టేషన్ రోడ్డు,పాకాల రోడ్డు మరియు ఆర్ టి సీ బస్ స్టాండ్ సెంటర్ నందు బుధవారం సింగరాయకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ హజరత్తయ్య ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించడం జరిగింది. ఈ తనికఖీలలో భాగంగా ఒక ఆటోను సుమారు 25 బైకులు పైచిలుకు వాహనాలను సీజ్ చేయడం జరిగింది. వాహనాలు యొక్క సంబంధిత డాక్యుమెంట్లు పరిశీలించి వాహనాలకు జరిమానా విధించడం కానీ, వాహనాలను జప్తు చేయడం జరుగుతుందని తెలిపారు. గాంజా తనిఖీని మరియు బెల్ట్ షాపులు తనిఖీని అసాంఘిక కార్యక్రమాలు జరుగు ప్రదేశాల్ని పరిశీలించడం, వాహనాలను తనిఖీ చేసి డాక్యుమెంట్ లేని వాహనాలను సీజ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఒంగోల్ ఏ ఆర్ అడిషనల్ ఎస్పీ యం ఎస్ ఎస్ అశోక్ బాబు మరియు సింగరాయకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ చావా హజరతయ్యా, యాస్పై సింగరాయకొండ బి మహేంద్ర ఇద్దరు రిజర్వ్ ఇన్స్పెక్టర్లు ఎస్ వి రమణ రెడ్డి ,రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్లు ప్రసాద్ మరియు సుమారు 70 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న కారు.. నలుగురికి గాయాలు

విశాలాంధ్ర -ఒంగోలు : ముందు వెళ్తున్న లారీ ఢీకొన్న కారు ప్రమాదంలో నలుగురు వ్యక్తులు తీవ్ర గాయాల పాలైన ఘటన ఒంగోలులో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలలోకి పోతే చెన్నై నుండి విజయవాడ వెళ్తున్న కారు ఒంగోలు లోని కొత్తపట్నం ఫ్లైఓవర్ వద్ద ముందు వెళ్తున్న లారీని ఢీ కొట్టింది.. ఈ ఘటనలో కారు మృజ్జు నుజ్జు కాగా శాఖమూరి ధనుంజయ నాయుడు, ఎస్ శారద, పి నాగేశ్వరమ్మ, డ్రైవర్ కోరుకొండ నగేష్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108 వాహనం ద్వారా ఒంగోలులోని అస్టర్ రమేష్ హాస్పటల్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. గతంలో చిన్నారులు సురక్షితంగా ఉన్నారు.

కౌలు రైతు కార్డులతో ప్రభుత్వ పథకాలు

విశాలాంధ్ర - జె.పంగులూరు : కౌలు రైతు ఋణ అర్హత కార్డులను మంజూరు కార్యక్రమం మండలంలోని తూర్పు కొప్పెరపాడు గ్రామంలో బుధవారం కొప్పెరపాడు గ్రామంలోని రైతు సేవకేంద్రంలో గ్రామ సభ నిర్వహించగా ముఖ్య అతిధిగా మండల తహసీల్దార్ పోపూరి సింగారావు పాల్గొన్నారు. ప్రతి కౌలు రైతు తప్పనిసరిగా సిసిఆర్ కార్డును తీసుకోవాలని కార్డు పొందిన అందరికి రైతులకు ప్రభుత్వం నుండి అందే అన్ని సదుపాయాలు సబ్సిడీ విత్తనాలు, వ్యవసాయ పరికరాలు, వ్యవసాయ రుణాలు అన్నీ పొందగలరని రైతులకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి డి.సుబ్బారెడ్డి రెవిన్యూ సిబ్బంది గ్రామ వ్యవసాయ సహాయకులు గ్రామ రైతులు పాల్గొన్నారు.

పీఎం సూర్య ఘర్ వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - యద్దనపూడి : ప్రజా రక్ష పీఎం సూర్య ఘర్ ప్రతి ఇంటికి రూఫ్ టాప్ సోలార్ ప్యానెల్స్ పెట్టుట ద్వారా 300యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ అందించబడుతుందని ఎంపీడీఓ పి.టీ.వి. కృష్ణ అన్నారు. ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ, ఓసీ, కమ్యూనిటీ లకు సంబందించి 3కేవీ సోలార్ యూనిట్ల కొరకు యూనిట్ కాస్ట్ 2,10,000 కాగా అందులో లబ్ది దారుని వాటా 20000, ప్రభుత్వ సబ్సిడీ -78000, బ్యాంక్ లోన్ 1,12,000 డబ్బుతో విద్యుత్ శాఖ వారి ద్వారా ఇన్స్టాల్ చేస్తారని తెలిపారు. అందరూ బీసీ, ఓసీ, కమ్యూనిటీ లు సోలార్ ప్యానల్స్ బిగించుకొనుట ద్వారా ఉచితంగా కరెంటు పొందవచ్చునని, సబ్సిడీ పొందవచ్చు అన్నారు. కరెంటు బిల్లు, ఇంటి పన్ను పత్రము, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ బుక్ తీసుకోని సచివాలయం వద్దకు గాని, ఇంటర్నెట్ వద్దకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఎంపీడీఓ తెలియజేశారు.

గీతికకు మాజీ ఎమ్మెల్యే ఆమంచి అభినందనలు

విశాలాంధ్ర - వేటపాలెం : చీరాల గౌతమి కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో స్టేట్ సెకండ్ ర్యాంక్, బాపట్ల జిల్లాలో ప్రధమ ర్యాంక్ సాధించిన గాయత్రి బిల్డర్స్ అధినేత దేవన వెంకటశివకుమార్ కుమార్తె గీతిక 470 మార్కులకు 467 మార్కులు సాధించిన సందర్భంగా మాజీ శాసనసభ్యులు ఆమంచి కృష్ణమోహన్ బుధవారం పందిళ్ళపల్లి పంచాయతీ లోని తోకపేటలోని దేవన గీతిక గృహానికి వెళ్లి గీతిక కు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియచేసి వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గీతికకు మెమెంటో నగదు బహుమతి అందించి శాలువాతో సన్మానించారు. రానున్న రోజులలో ఇలాంటి విజయాలు సాధించి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు.గౌతమి కాలేజీ యాజమాన్యం వారికి కూడా ఆయన అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కోనంకి నాగయ్య, డికె మాస్టర్, మాజీ సర్పంచ్ పి. మోహన కుమారి, వోలుకుల మోహన్‌రావు, బండ్ల బాబు, యారాసు అరుణ్ బాబు, కుర్మా రాహుల్జీ, నాసిక జగన్,గౌరాబత్తుని సాయి, గౌరాబత్తుని బాబురావు, గుత్తి సదాశివం, దేవన గంగాధర్ రావు, కొలుకుల రామాంజనేయులు, పిచ్చుక భార్గవ్,కర్ణ పోలయ్య, దోగుపర్తి రాజేష్, పృథ్వీ ఉదయ్ కుమార్, పెరిసేట్ల శ్రీమన్నారాయణ, గౌరా బత్తుని బుల్లియ్య, గుంటూరు శ్రీనివాస రావు, యూత్ బాబు, చింతా రత్నం,తలతోటి డేవిడ్, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో పిల్లలకు ఆటల పోటీలు

విశాలాంధ్ర - సంతమాగులూరు : సంతమాగులూరు శాఖ గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలకు బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. 20వ రోజు బుధవారం 25 మంది విద్యార్థులు హాజరయ్యారు. గ్రంథపాలకుడు బాదం విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో క్యారం బోర్డు, చదరంగం, పిన్ బోర్డు, లూడో వంటి ఆటల పోటీలు ఏర్పాటు చేశారు.

డైరీ యూనిట్ ఏర్పాటుకు రూ.5 కోట్లు మంజూరు

విశాలాంధ్ర - కొండపి :

నియోజకవర్గ కేంద్రమైన కొండేపిలో వ్యవసాయ ప్రధాన అనుబంధ కార్యక్రమమైన డైరీ యూనిట్ ఏర్పాటు చేయుటకు సెర్ప్- డి ఆర్ డి ఏ -వెలుగు శాఖ ద్వారా ఐదు కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మారిటోరియం బోర్డ్ డైరెక్టర్ దామచర్ల సత్య తెలియజేశారు. మండల పరిషత్ కార్యాలయంలో డిఆర్డిఏ వెలుగు శాఖ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ బి గోపీనాథ్ అధ్యక్షతన బుధవారం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి మారిటోరియం బోర్డ్ డైరెక్టర్ దామచర్ల సత్య మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ఉన్నటువంటి చిన్న సన్న కారు రైతులకు వ్యవసాయంతో పాటుగా ప్రధాన అనుబంధ కార్యక్రమమైనటువంటి పాడి పరిశ్రమను అభివృద్ధి కొరకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఇందులో భాగంగా సర్ప్ ద్వారా ప్రత్యేకంగా కొండేపి నియోజకవర్గ పరిధిలో రెండు డైరీ యూనిట్ లను మంజూరు చేయించడం జరిగిందని, ఒకటి కొండేపిలో కాగా మరొకటి సింగరాయకొండ మండలం పాకల గ్రామంలో ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. యూనిట్‌కి కావలసినటువంటి స్థల సేకరణలో సంబంధిత తహసీల్దారు సహకరించి తల కేటాయింపులు త్వరతగతిన పూర్తి చేయాలని సూచించారు.

మాజీ ఏఎంసీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలు అనేవి ముఖ్యమంత్రి చంద్రబాబు మానస పుత్రిక లాంటిదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పక్షపాతంగా వ్యవహరిస్తూ వారి కుటుంబ జీవనోపాధి మెరుగుపరుచుకునే నిమిత్తం సెర్ఫ్ డిఆర్డిడిఏ వెలుగు శాఖ ద్వారా విరివిగా రుణాలు అందించడం,సంక్షేమ మరియు అభివృద్ధి కార్యక్రమాలు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి మహిళా కూడా ప్రభుత్వం ద్వారా అందిస్తున్నటువంటి రుణాలను అందుకొని అభివృద్ధి చెందాలని కోరారు. ఎల్ హెచ్ డైరెక్టర్ శ్రీమతి పద్మావతి గారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాబోయే ఆర్థిక సంవత్సరంలో మహిళలు కి కావలసినటువంటి అవసరాలను గుర్తిస్తూ వార్షిక జీవనోపాదుల ప్రణాళికలను వెలుగు సిబ్బంది ద్వారా తయారు చేయించడం జరిగిందని తెలిపారు. ఈ తయారైనటువంటి ప్రణాళికల ద్వారా మహిళల అవసరాలను తీర్చి వారి జీవనోపాధి మెరుగు కొరకు రుణాలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ రుణాలను బ్యాంకులు అదేవిధంగా శ్రీనిధి, ఎస్సీ ఎస్టీలకు అందించే ఉన్నతీ రుణాలు అన్ని క్రోడీకరించి మహిళా సంఘ సభ్యులకు కావలసినటువంటి అవసరాలను తీర్చడం జరుగుతుందని తెలిపారు.

డిఆర్‌డిఏ పీడీ మాట్లాడుతూ మండలంలో ఉన్నటువంటి ప్రతి స్వయం సహాయక సంఘ సభ్యుల కుటుంబ సభ్యుల వివరాలను కొత్తగా వచ్చినటువంటి యాప్ లో తప్పనిసరిగా నమోదు చేయాలని భవిష్యత్‌లో ఆ యాప్ ద్వారా మాత్రమే వారికి కావలసినటువంటి జీవనోపాధికి అవసరమైనటువంటి నిధులను అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి మహిళ ముఖాలను ఈ యొక్క యాప్ లో ఫోటోలు ద్వారా క్యాప్చర్ చేసి సర్వర్ కి పంపాలని ఆదేశించారు. మహిళలందరూ కూడా తప్పనిసరిగా సిబ్బందికి సహకరించి వారి వారి వివరాలను నమోదు చేయించు కోవాలని మహిళలను కోరారు. ఈ యొక్క కార్యక్రమాన్ని మండలంలో త్వరతగతిన పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పరుగు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

విశాలాంధ్ర-సంతనూతలపాడు :

పేదలకు అన్నదాన సేవా కార్యక్రమాలు చేపట్టడమే మా ఆశయం అని చైర్మన్ వెంకటరమణ అన్నారు. స్థానిక సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ట్రస్టు ప్రథమ వార్షికోత్సవ అన్నదాన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా కేకును కట్ చేసి పేదలకు పంచిపెట్టారు. చైర్మన్ శనగల వెంకటరమణ ట్రస్ట్ ఫౌండర్ పాతూరి సంపత్ ఎన్నారై పర్యవేక్షణలో దేశ విదేశాల నుండి దాతల సహకారంతో 52 వారాలు పాటు పేదలకు అన్నదాన కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అదే విధముగా పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించటం తోపాటు పేదలకు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వారికి మందులు పంపిణీ చేయటం అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు చేయించి ఆర్థిక సహాయ సహకారాలు అందించడం జరుగుతుందన్నారు. అలాగే సీనియర్ జర్నలిస్ట్ శిఘాకొల్లి శ్రీనివాసరావును శాలువ కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ ఎస్ వెంకటరమణ వైస్ చైర్మన్ పి.నారాయణస్వామి చౌదరి ట్రస్ట్ సెక్రెటరీ చివుకుల రాంగోపాల్ జాయింట్ సెక్రెటరీ కే వెంకటేశ్వర్లు ట్రస్ట్ సభ్యులు శిఘాకొల్లి ధనలక్ష్మి వేమా కవిత బి సుధారాణి ఆర్ జార్జి మద్ది మల్లికార్జునరావు ఎస్ మల్లారెడ్డి, ఎం శ్రీనివాసరావు ఏ. గోపాలకృష్ణ కే ఆంజనేయులు తన్నీరు నాగేశ్వరరావు ఎస్ శ్రీనివాసరావు గ్రామ నాయకులు బొడ్డు శంకర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు రసవత్తంగా ఎడ్ల బల ప్రదర్శన పోటీలు

విశాలాంధ్ర-పీసీపల్లి :

ప్రకాశం జిల్లా పీసీపల్లి మండలంలోని పెదఅలవలపాడు పంచాయతీ పరిధిలోని వెంగళపురం గ్రామ సమీపంలో పాలేటి గంగ దగ్గర 36 అడుగుల అభయాంజనేయ స్వామి జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని మంగళవారం నుంచి జరుగుతున్న జాతీయస్థాయి ఎడ్ల పోటీలలో భాగంగా రెండవ రోజైన బుధవారం జూనియర్ విభాగ ఎడ్ల బల ప్రదర్శన పోటీలు రసవత్తంగా సాగాయి. ఎద్దులు బండలాగుతూ పరుగెత్తుతుండగా తిలకించే ప్రజల్లో ఉత్సాహం పెరిగి ఆనందం వెల్లివిరిసింది. ఈ పోటీలను చూసేందుకు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. మంగళవారం వ్యవసాయ విభాగ ఎడ్ల బల ప్రదర్శన జరగగా బుధవారం జూనియర్ ఎడ్ల బల ప్రదర్శన పోటీలు నిర్వహించారు. బుధవారం నిర్వహించిన జూనియర్ విభాగం ఎడ్ల బల ప్రదర్శన పోటీలలో బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోట

శివకృష్ణ శిరీష సోదరి ఆర్కే బుల్స్ 4230.1 మీటర్లు లాగి మొదటి బహుమతి రూ 60116 సాధించగా కృష్ణాజిల్లా చల్లపల్లి మండలం నాదెర్ల వారి పాలెం గ్రామానికి చెందిన కాకర్ల సురేష్ బాబు ఎడ్లు 3750 మీటర్లు లాగి రెండవ బహుమతి రూ 50116 సాధించగా గుంటూరు జిల్లాకి చెందిన సోమిశెట్టి ఆంజనేయులు ఎడ్లు 3600 మీటర్లు లాగి మూడవ బహుమతి రూ 40116 సాధించగా బాపట్ల జిల్లా పర్చూరు మండలం చిననందిపాడు గ్రామానికి చెందిన ఆళ్ల మోహనరావు ఎడ్లు 3500 మీటర్లు లాగి నాలుగో బహుమతి 30116 గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కుంచనపల్లి గ్రామానికి చెందిన బుర్ర ముక్క కౌసల్యా రెడ్డి ఎడ్లు మీటర్లు లాగి ఐదవ బహుమతి రూ 20116 సాధించగా పలనాడు జిల్లా చిలకలూరిపేట మండలం గ్రామానికి చెందిన గోపాల బ్రహ్మయ్య ఎడ్లు 750 మీటర్లు లాగి ఆరవ బహుమతి రూ 15116 సాధించినట్లు నిర్వాహకులు తెలియజేశారు. ఆఖరి రోజైన గురువారం సీనియర్ ఎడ్ల విభాగ ప్రదర్శన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఎడ్ల బల ప్రదర్శన పోటీలు తిలకించేందుకు వచ్చిన భక్తులకు 36 అడుగుల అభయాంజనేయ స్వామి చైర్మన్ కొంపల్లి మాలకొండయ్య ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

నేడు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే రాక :

గురువారం జరగనున్న సీనియర్ ఎడ్ల బల ప్రదర్శన పోటీలను ప్రారంభించేందుకు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే ముహమద్ నసీర్ అహ్మద్ ముఖ్య అతిథిగా హాజరవుతారని నిర్వాహకులు తెలియజేశారు.